# మూడు చేపలు

రావి కొండలరావు

(మళ్ళీ చెప్పిన కథలు)


**పవిత్రమైన నదులు ప్రవహించే దేశం - ప్రసిద్ధి చెందిన భారతదేశమే అన్నారు పెద్దలు. కాని వాటికి సఖ్యతా లేదు, ఐక్యతా లేదు. జాతీయభావం అంతకంటే లేదు - ప్రజల్లాగే.**

ఏ నదో ఎక్కడో పుట్టి, ఎక్కడెక్కడో తిరిగి, సముద్రాన్ని వెతుక్కుంటూ వెళ్లి అందులో లీనమైపోతుంది - ప్రజల సొమ్మంతా ప్రభుత్వ ధనాగారాల్లో లీనమైనట్టు. పైగా ఆ నదులు తమ ఇచ్చవచ్చిన రీతిలోనే వెళ్తాయి కానీ, ఊళ్ళు, పట్టణాల మధ్య నుంచో, పక్కనుంచో వెళదామన్న ఆలోచనే రాదు వాటికి. కొన్ని ఊళ్లకి రైల్వేస్టేషన్లు దూరంగా ఉంటాయి. వచ్చే రైళ్లన్నీ స్టేషన్లోనే ఆగుతాయి గాని, "పోనీ, ఊరు అక్కడెక్కడో ఉంది కదా, అక్కడికి వెళ్లి ఆగి, జనానికి సౌకర్యం కల్పిద్దాం" అన్న ఆలోచనే వాటికి ఉండదు. ఈ భారతీయ నదులు కూడా భారతీయ రైళ్లనే ఆదర్శంగా తీసుకున్నట్టున్నాయి. రైళ్ల సౌకర్యం లేని వాళ్లు బళ్లమీదా, బస్సులమీదా ఆధారపడినట్టు, నదుల సౌకర్యం లేని ఊళ్లు చెరువులమీదా, సరస్సుల మీదా ఆధారపడ్డాయి.

అలా ఒక గ్రామానికి దూరంగా ఒక చెరువుంది. ఆ గ్రామంలో చదువు లేని వాళ్లతోపాటు, చదువువున్నవాళ్లూ ఉన్నా చెరువు విషయంలో ఎవరూ ఆరోగ్యసూత్రాలు పాటించరు. అందులోనే బట్టలు ఉతుకుతారు, ఇంకోటి చేస్తారు. ఆ నీళ్లే తాగుతారు. "ఏం మనుషులో! మనపాటి ఆలోచన, వివేకం కూడా లేవు ఈ మనుషులకి!" అనుకుంటూ ఉంటాయి ఆ చెరువులో కాపురం ఉంటున్న చేపలు. మిగతా చేపలు జాతిమతాల పేరుతో కీచులాడుకుంటున్నా, ఒక మూడుచేపలు మాత్రం మంచి మిత్రులు. మూడూ కలిసి ఈతలు కొడుతూ, షికార్లు చేస్తూ, దొరికిన పురుగూపుట్రనీ పంచుకుంటూ సఖ్యంగా ఉంటున్నాయి. వాటికోసం పడుతున్న వలలకి అందకుండా, ఆవలకీ, ఈవలకీ ఈదుతూ, తప్పించుకుంటూ ఉంటాయి- రక్షకభటులు వేసే వలలకి చిక్కకుండా తప్పించుకునే నేరస్థుల్లాగా, మగవారలు వేసే వలపుల వలలలో పడకుండా తప్పించుకునే కొందరు ఆడువారలులాగా, ఈ మూడు చేపలకీ అలాంటి నైపుణ్యాలున్నాయి. ఐతే, మూడు చేపలవీ మూడు రకాల మనస్తత్వాలు. ఒక చేప దూరాలోచనగల చేపయితే, ఇంకో చేప సమయానికి సర్దుకుపోయే యోచనగల చేప. మూడో చేప "ఎలా జరిగేది అలా జరుగుతుంది. దానికోసం ముందే ఆలోచన చెయ్యడం అనవసరం!" అని కొట్టిపారేసే చేప.

ఊరు మధ్యలో ఉన్న నాలుగు రోడ్ల జంక్షన్‌లో మిత్రులు కలుసుకున్నట్టు ఒకరోజు మూడూ తటాకమధ్యంలో కలుసుకున్నాయి.

"మీనమిత్రులారా! నేనొక విషయం చెప్పదలుచుకున్నాను, సావధాన చిత్తులై వినుడు. ఎండాకాలం రాబోతోంది. పోయిన సంవత్సరంలో వర్షాలు కూడా బాగా లేవు. ఈ సంవత్సరం ఎండలు బాగా ముదురుతాయనీ, వానలు కురవవనీ జోస్యులు చెబుతున్నారు. అంచేత




మనం, ఇక్కడే ఈ తటాకంలోనే కూపస్థ మండూకాల్లాగా ఉండిపోవడం భావ్యం కాదు. చెరువు ఎండిపోవడం ప్రారంభిస్తే మనమీద సులభంగా వలలు పడతాయి. మనం చిక్కుకోడం ఖాయం. అంచేత మనం ఈ చిన్న చెరువుని విడిచిపెట్టి దూరంగా ఉన్న ఇంకో ప్రాంతంలోని పెద్ద చెరువుకు వెళ్లిపోదాం. అక్కడయితే మనం సురక్షితంగా ఉంటాం!" అంది మొదటి చేప.

దానికి రెండో చేప నవ్వింది. "నువ్వు పిచ్చివాడివి, మిత్రమా! ఎప్పుడో ఏదో రాబోతుందని ఇప్పుడే ఆలోచన ఎందుకు? కరువొస్తుందని చెరువు ఖాళీ చెయ్యడం- ఎప్పుడో రోగం వస్తుందని ముందే వైద్యుణ్ని తెచ్చిపెట్టుకున్నట్టుంది. ఇంకో చెరువులో మాత్రం మనం సురక్షితంగా ఉంటాం అనుకోవడం అవివేకం కాదా? అది మనుషుల ఆలోచనలాంటిది. అక్రమంగా సంపాదించిన సొమ్ము విదేశీబాంకుల్లో దాచుకుంటే, క్షేమంగా ఉంటుందనుకుంటారు. కానీ, దొరికిపోతూనే ఉంటారు. అలాగే, మనం ఈ చెరువుని కాదని ఇంకో చెరువుకి వెళ్తే, అది మాత్రం ఎండిపోదని గారంటీ ఏమిటి? వర్షాలు పడకపోతే, అది మంత్రిగారు తవ్వించిన చెరువైనా, ఎండిపోక తప్పదు! పైగా జోస్యాలన్నీ నిజమవుతాయని కూడా చెప్పలేం. వార్తాపత్రికల్లో వాతావరణ సూచన అని వేస్తారు. ప్రతిరోజూ వేసినట్టే జరుగుతోందా? అంతెందుకు - ప్రతిరోజూ బస్సుప్రమాదమో, రైలుప్రమాదమో జరుగుతూనే ఉన్నాయి. దానికి భయపడి ప్రజలు ప్రయాణాలు మానుకుంటున్నారా? వానలు రాక చెరువు ఎండిపోయి నప్పుడు ఆలోచించుకోవచ్చు!" అంది రెండో చేప. రెండూ కలిసి మూడో చేప అభిప్రాయం అడిగాయి.

"మనం మనుషుల్ని ఎంత కాదనుకున్నా వాళ్ల దగ్గర కొన్ని నేర్చుకోవాలి. రాజకీయరంగంలో ఉన్నవాళ్లు ఏ పార్టీ నెగ్గుతుందో పసిగట్టి చట్టున అందులోకి దూకుతారు. ఒక మంత్రివర్గం పడిపోతూ ఇంకో మంత్రివర్గం లేస్తున్నప్పుడు కూడా టక్కున ఇందులోకి దూకుతారు. అలా దూకడాలు మనంకూడా నేర్చుకోవాలి. మనమీద

వలలు పడ్డాయనుకోండి, చటుక్కున దూకి తప్పించుకోడానికి ప్రయత్నించాలి. మనుషుల్లో కొందరు ఏ ఎండకి ఆ గొడుగు పడతారు. ఏ చలికి ఆ శాలువా కప్పుకుంటారు. అలాగే మనం కూడా ఏ నీటికి ఆ ఈత ఈదడం తెలుసుకోవాలి. పైగా మన జాతి ఏ ఒక్కరికీ భయపడవలసిన జాతి కాదు. సాక్షాత్తూ



శ్రీమహావిష్ణువు ఎత్తిన ప్రథమావతారం మనం. మన పేరు మీదనే మీనాక్షి దేవత ప్రసిద్ధి చెందింది. అందమైన కళ్లకి మన ఆకారాలే ఆదర్శం. ఏదో ఈ చెరువులో పడి కొట్టుకుంటున్నాం గనక, మీనజాతి అంటే హీనజాతి అనుకోకండి. జలచరాల్లో అగ్రజాతి మనదే అన్నమాట మరిచి పోకండి!" అని మూడో చేప ఆవేశంగా, తమ జాతి ఆధిక్యత గురించి ప్రసంగించింది.

అంతా విన్న తర్వాత మొదటి చేప ఓ నిట్టూర్పు విడిచింది. "ఇవాళ అగ్రజాతి, ఉగ్రజాతి అంటూ లేవు. అన్నీ ఒకటే. అందరితోపాటు మనమూ ఈ తటాకంలోనే జీవిస్తున్నాం. చెరువులోని నీళ్లు ఎండిపోడానికీ, మన జాతి ఔన్నత్యానికీ సంబంధం లేదు. ఏమైనా నేను మాత్రం 'తెప్పలుగ చెరువు నిండిన కప్పలు పదివేలు చేరు' అన్నట్టుగా చేరువలోనే ఉన్న ఇంకో చెరువుకి చేరు కుంటాను."

"నీ ఇష్టం, మిత్రమా!" అన్నాయి తక్కిన రెండూ.

ఆ రాత్రి అనుకోకుండా పెనుగాలులు వీచాయి. ఆకాశం నిండా కారు మబ్బులు లేచాయి. చూస్తూ ఉండగానే హోరున గాలీ, జోరున వానా ఆరంభమైనాయి. అలా రెండురోజులపాటు కురిసిన కుంభవృష్టికి తటాకం పొంగింది. చిన్న చెరువులూ, పెద్ద చెరువులూ ఏకమైపోయాయి. ఎక్కడెక్కడినుంచో మీన'రాశులు' కొట్టుకొచ్చి ఈ తటాకంలో కలవడంతో చేపలు పట్టేవాళ్ల పంట పండింది. వర్షం తగ్గడం ఏమిటి, పెద్ద పెద్ద వలలతో వచ్చి చేపలు పట్టడం మొదలుపెట్టారు. మిత్రులు ముగ్గురూ కంగారు పడ్డారు, గాబరా పడ్డారు. "మిత్రులారా! ఇప్పుడింక ఎవరమూ తప్పించుకోలేం. మొత్తం మత్స్యజాతినే మృత్యువు కబళించబోతోంది. నేను ఇంకో తటాకానికి పోయినా నా బతుక్కి గారంటీ లేదు!" అంది మొదటి చేప.

"అయినా, ఈ అకాలవర్షాలేమిటి - ఎన్నడైనా ఎరుగుదుమా!" అన్నది ఒక వృద్ధమత్స్యం అందరి మధ్యా చేరి.

"ఈ అకాలవర్షానికీ ప్రకృతివిజృంభణకీ మనకి వలలు వేస్తున్న మనిషే కారకుడు. వాతావరణంలోని పచ్చదనాన్ని హరిస్తున్నాడు. అంతరిక్షంలో ప్రయోగాలు చేస్తున్నాడు. పారిశ్రామిక అభివృద్ధి అంటూ పొగలు వదులు తున్నాడు. వాహనాల్ని పెంచుకుంటూ, వాతావరణం కలుషితం చేస్తున్నాడు. ప్రకృతిమీద మనిషి తిరుగుబాటు చేస్తే ప్రకృతి సహించదు. ఋతువులు మారిపోతున్నాయి, కాలాలు మారిపోతున్నాయి. అతివృష్టికీ, అనావృష్టికీ కారణం ప్రకృతి కాదు, మనిషే! కానీ, ఈ మనుషులకే మనం ఆహారమవు తున్నాం. ఈ నీటివల్ల మనలోనూ కాలుష్యం.చేరింది. కల్మషం గల మానవ జాతికి, కలుషితమైన ఆహారమే దక్కుతుంది. కానీండి!" అంది రెండో చేప ఉద్రేకంగా. మిత్రులు ముగ్గురూ తప్పించుకోవాలని ఎంత ప్రయత్నించినా, వాళ్లకి సాధ్యం కాలేదు. వాటికీ ఎన్ని ఆలోచనలూ పథకాలూ ఉన్నా మనిషి పన్నిన వల ముందు అవేవీ పారలేదు! ■